


# చదరంగంలో హత్య

'ఇండియన్ ఛస్ అసోసియేషన్' ప్రతీసంవత్సరం మార్చినెలలో చదరంగం పోటీలు నిర్వహిస్తుంది. బొంబాయిలోని ఇండియన్ అసోషియేషన్ బిల్డింగ్‌లో.

ఉత్తర భారతదేశంలో, దక్షిణ భారతదేశంలో ఆ సంవత్సరం ఎన్నికయిన ఛాంపియన్స్ ఇద్దరిమధ్యా పోటీ జరుగుతుంది. దాంట్లో ఎవరు గెలుస్తే వాళ్ళని ఇండియన్ ఛస్ చాంపియన్‌గా గుర్తిస్తుంది.

ఈ యేడు సౌత్ ఇండియన్ చాంపియన్ నాయర్ నార్తిండియా చాంపియన్ వినోద్ ఆడుతున్నారు ఛస్. బొంబాయిలోని అసోసియేషన్ బిల్డింగ్‌లో.

దాదాపు అయిదువందలమంది ప్రత్యేక ఆహ్వానితులు గమనిస్తున్నారు ఆ మేటి ఆటగాళ్ళ ఆటని ఆసక్తితో.

మొదటి రెండు ఆటల్లో ఒకదానిలో నాయర్, మరో దానిలో వినోద్ గెలిచారు.

మూడో ఆట చివరిది. దాంట్లో ఎవరుగెలుస్తే వాళ్ళే సంవత్సరం అంతా ఇండియన్ ఛస్‌మాష్టర్.

రెండు సంవత్సరాలుగా నాయర్, వినోద్‌ల మధ్య జరుగుతోంది

ఆట. రెండు సంవత్సరాలుగా వినోద్ గెలిచాడు. నాయర్ ఓడిపోయాడు. మూడోసంవత్సరమయినా తను 'ఇండియన్ ఛస్ మాష్టర్‌గా కీర్తింపబడా లనే దృఢ సంకల్పంతో ఉన్నాడు నాయర్.

ఎలాగయినా అవును. ఎలాగయినా తనే గెలవాలి. ఇదే నాయర్ మనసులో మెదిలే సంగతి.

మొదటి ఆటలోనే నాయర్ తెలుసుకోగలిగాడు వినోద్ ఎందుకు గెలుస్తున్నాడో. ఎంతో దూరదృష్టితో ఆడుతాడు. ఆటలో మంచి మెళకు వలు తెలుసు.

మనసు నాయర్‌కి ఆ అసోసియేషన్ భవనంలో లేదు. అందరి మధ్య ఉన్నా ఆలోచనలో మునిగివుంది. మూడోఆట ఎలాగయినా తనే గెలవాలి. కాని ఎలా?

ఎలా గెలవాలి అని ఆలోచిస్తున్నాడు. మన్నాడు వినోద్‌తో గెలవ గలననే ధైర్యం తగ్గిపోయింది. మూడో ఆటలో వినోద్ చాలా జాగ్ర త్తగా ఆడతాడు.

రెండో ఆట అవగానే ఓ అసోసియేషన్ మెంబర్ కారు నాయర్, వినోద్‌లను హోటల్ టాజ్‌ముందు దించి వెళ్ళిపోయింది. ఇద్దరూ టాజ్ మహల్ హోటల్‌లోకి వెళ్ళారు.

పక్కమీదికి వాలిపోయాడు నాయర్. కొన్ని క్షణాలు కళ్ళుమూసు కుని ఉండిపోయాడు.

ఎలా? ఏం చేయాలి? వినోద్‌తో గెలుపు అనుమానమే.

చదరంగం తెలివికి సంబంధించిన ఆట. అదృష్టానికి సంబంధిం చిన ఆటకాదు. టేబిల్ టెన్నిస్‌లాగానో, బేడ్‌మింటన్‌లాగానో.

ఎలా అన్న ప్రశ్నకి సమాధానం ఎప్పుడో నాయర్ మనస్సుకి తట్టింది. కాని అంత ధైర్యం చెయ్యగలవాల తను? వినోద్‌ని అంతపని చెయ్యగలడా?

వినోద్ ఆటల్లోచేసే పని తను ప్రాక్టికల్‌గా చెయ్యాలి. చేస్తే? గుండె ఝల్లుమంది తన ఆలోచనకి.

వినోద్ చదరంగంలో పావులని బలి తీసుకుంటాడు. అతను తన తెలివిని ఉపయోగించి చదరంగంలోని పావులాగా వినోద్‌ని తొలగిస్తే?

కొన్ని క్షణాలు తన ఆలోచనని ఆపి, సిగరెట్‌పాకెట్ తీసి సిగరెట్ వెలిగించాడు నాయర్. సిగరెట్ సగం కాలేదాకా కళ్ళు మూసుకుని ఉండిపోయాడు ఏ ఆలోచనా లేకుండా.

మళ్ళీ తలనిండా ఆలోచనలు. ఎలా ఆపని చేయడం? తను వినోద్‌ని హత్య చేసినట్లు బయటపడితే పరువు పోవడమే కాకుండా, ఉరి శిక్షకూడా పడవచ్చు.

వినోద్ హత్య చేయబడితే అనుమానం తనమీదకి వస్తుంది. ప్రమాదవశాత్తు మరణిస్తే అనుమానం కలగవచ్చు, కలగకపోవచ్చు. ప్రమాదవశాత్తు మరణించినట్లుగా నమ్మించాలి అందరినీ. నేరం రుజువు కానంతవరకు శిక్ష పడదు తనకి. రుజువు కాకుండా చూసుకోవాలి.

ఎలా?

మళ్ళీ అదే ప్రశ్న.

సిగరెట్ ఏష్‌ట్రేలో పడేసి, లేచి కిటికీ దగ్గరకు వెళ్ళి బయటికి చూశాడు.

దూరంగా సముద్రం. బొంబాయిలోని టాజమహల్ హోటల్ సముద్రానికి దగ్గిరగా కట్టబడింది. హోటల్ గది కిటికీలోంచి చూస్తేచాలు. సముద్రం కనబడుతుంది దూరంగా.

సముద్రంవంక చూస్తూ అయిదునిముషాలు ఆలోచిస్తూండిపోయాడు నాయర్. నిశ్చలంగా ఉన్న ఆ సముద్రం లోపలికి వెళితే ఏం జరిగేది ఎవరూ చూడలేరు.

క్రమంగా తన ఆలోచనలని ఓ పథకంగా రూపొందించుకో

సాగాడు నాయర్. పావుగంట తర్వాత కిటికీముందునుంచి కదిలాడు. కొత్త సిగరెట్ వెలిగించాడు.

ఇప్పుడు నాయర్ మనసు ఉరకలు వేస్తోంది.

సిగరెట్ ఏష్ట్రేలో ఆర్పేసి, టెలిఫోన్ అందుకున్నాడు నాయర్. రిసెప్షనిస్టుతో మాట్లాడి సముద్రంలో షికారుకి వెళ్ళేందుకు చిన్న పడవ లాంటిదేమయినా దొరుకుతుందేమో అడిగాడు.

"సారీ మిష్టర్ నాయర్. మా దగ్గర అలాంటిదేమీలేదు. కాని "యాచింగ్ క్లబ్" వాళ్ళదగ్గర దొరుకుతుందేమో ప్రయత్నించిచెపుతాను."

"తప్పకుండా ప్రయత్నం చెయ్యండి. నా కవసరమని చెప్పండి. ఎలాగయినా సంపాదించాలి"

"ఐ విల్ డు మై లెవెల్ బెస్ట్"

పావుగంట తర్వాత ఫోన్ మోగింది. నాయర్ అందుకున్నాడు రిసీవర్ ఆత్రంగా.

"యు ఆర్ లక్కీ మిష్టర్ నాయర్. ఒక మోటార్ బోట్ ఉంది. ఇంకో అరగంటలో సిద్ధమవుతుంది. తయారుగా ఉండండి" చెప్పింది రిసెప్షనిస్ట్.

"థాంక్స్ ఎక్కడికి వెళ్ళాలి నేను"

"అవసరంలేదు. ఆ క్లబ్ మనిషి వస్తాడు మీ దగ్గరకి. అతనే బోట్ అందిస్తాడు మీకు.

"థాంక్స్ ఒన్స్ ఎగెయిన్"

రిసీవర్ క్రేడిల్‌మీద పెట్టేశాడు నాయర్. అయిదు నిముషాలు ఆగి గది తలుపు తెరచి బయటకి వచ్చాడు వినోద్ గదిలోకి వెళ్ళాడు, కొన్ని క్షణాలు ఆలోచించి.

వినోద్ కుర్చీలో కూర్చుని ఉన్నాడు. ఎదురుగా ఉన్న చిన్న బల్ల మీద ఓ పుస్తకం ఉంది. చెస్‌కి సంబంధించిన పుస్తకం.

నాయర్‌ని చూసి చిన్నగా నవ్వాడు వినోద్.

"రేపటిదాకా ఆ పుస్తకం చదువుతూనే ఉంటారా?" అడిగాడు నాయర్ నవ్వుతూ.

"అలవాటు" అన్నాడు వినోద్ బదులుగా నవ్వి,

"కాస్సేపు అలా బయటకి వెళదాం వస్తారా?"

"ఎంతదాకా?"

"సముద్రంలోకి."

"సముద్రంలోకా?"

"అవును. చాలా సరదాగా ఉంటుంది. కేరళలో పుట్టి పెరిగిన నాకు సముద్ర ప్రయాణం అంటే చాలా ఇష్టం."

"నేను ఎప్పుడూ వెళ్ళలేదు."

"ఒకసారి రండి సరదాగా ఉంటుంది. ఇంకో అరగంటలో వెళుతున్నాను. వస్తారా?"

"తప్పకుండా" అన్నాడు వినోద్ పుస్తకం మూసి.

"గుడ్ చల్లగాలికి బ్రెయిన్ కాస్త చల్లబడుతుంది కూడా."

వినోద్ పుస్తకం మూసి లేచాడు.

"నా గదిలో ఉంటాను రండి. అంతా సిద్ధమయ్యాక ఫోన్‌చేస్తాను"

"ఆల్‌రైట్."

అరగంట తర్వాత రిసెప్షనిస్ట్ ఫోన్ చేసింది నాయర్ గదికి. యాచింగ్ క్లబ్బునుంచి మనిషి వచ్చినట్లు.

"నేనే వస్తున్నాను."

ఫోన్ పెట్టేసి బ్రెడ్ కోసుకునే కత్తితీసి రుమాలుకి చుట్టిజేబులో వేసుకుని బయటకి నడిచాడు నాయర్.

"ఇతనే క్లబ్బునుంచి వచ్చినతను."

రిసెప్షనిస్ట్ పరిచయం చేసింది నాయర్‌కి అతన్ని. ఇద్దరూ ముందుకి నడిచారు. గుమ్మందాకా వచ్చాక అన్నాడు నాయర్ అతనితో తనకేం ఇంట్రస్టు లేనట్టుగా.

"వినోద్‌ని కూడా ఆహ్వానిస్తే బాగుంటుందేమో?"

"అవును" అన్నాడు క్లబునుంచి వచ్చినతను.

మళ్ళి వెనక్కి తిరిగి వెళ్ళి రిసెప్షనిస్ట్‌తో చెప్పి ఫోన్ చేశాడు నాయర్ వినోద్ గదికి తయారుగా ఉంటే క్రిందకి రమ్మని.

అయిదు నిముషాలలో వచ్చాడు వినోద్.

"గంటా గంటన్నరలో తిరిగి వచ్చేస్తాం" అన్నాడు నాయర్ రిసెప్షనిస్టుతో.

పావుగంట తర్వాత ముగ్గురూ ఇండియాగేట్ దాటి సముద్రతీరం చేరుకున్నారు.

చిన్నగా ఈల వేసాడు నాయర్ ఆగివున్న బోట్‌ని చూసి.

"చిన్న మోటార్‌బోట్ అనుకున్నాను. చాలా పెద్దదే" అన్నాడు.

"అవును పెద్దదే" అన్నాడు అతను నవ్వి.

"నాకు దీన్ని నడపటం వచ్చు" అన్నాడు నాయర్.

"నాకుతెల్సు క్రిందటి సంవత్సరం మీరు మా క్లబునుంచి ఓ బోటు తీసుకెళ్ళారు. మీ రాక్కరే నడిపారు దాన్ని. నాకు ఇంకా గుర్తు" చెప్పాడు అతను చిరునవ్వుతో.

తాళంచేతుల గుత్తి నాయర్‌కి అందించి అన్నాడు అతను.

"మీతో రావటం నాకు సంతోషమే. కాని వేరే ముఖ్యమయినపని అనుకోకుండా తగలడంతో నేను రాలేకపోతున్నాను ఏమీ అనుకోకండి"

"అలాగే ఫర్వాలేదు" అన్నాడు నాయర్.

"తిరిగి రాగానే ఈ నంబర్‌కి ఫోన్ చెయ్యండి. నేను వచ్చి తాళం చెవులు తీసుకుంటాను."

ఓ కార్డు అందించాడు అతను. దానిమీద ఓ ఆరు అంకెల టెలిఫోన్ నంబర్ రాసివుంది.

నాయర్, వినోద్ ఎక్కారు బోట్.

ఇగ్నీషియన్ కీ తిప్పి స్టార్టుచేశాడు నాయర్ బోట్ని. ఆ క్లబ్బు మనిషివంక చూసి చెయ్యిఊపి పోనిచ్చాడు సముద్రంలోకి.

వినోద్కి కొత్తగా ఉంది అంతా. ఎటుచూసినా నీళ్ళు. క్రమ క్రమంగా బొంబాయినగరం దూరం అయిపోతోంది చుట్టూ నీళ్ళమయం కొంచెం భయంవేసింది కూడా. బోట్ మునిగిపోతే? మధ్యలో ఆగిపోతే?

"ఎవరికిపడితే వాళ్ళకి ఇవ్వరు ఇది. మన ఆట చూడటానికి వచ్చిన వాళ్ళలో ఆ యాచింగ్ క్లబ్బు మెంబర్ కూడా ఉన్నాడు. మొహ మాటంవల్ల ఇచ్చారు."

"దాదాపు పాతికమైళ్ళు వచ్చాం సముద్రంలోకి" అన్నాడు నాయర్.

"ఇంక వెనక్కి తిరుగుదాం"అన్నాడు వినోద్.

"భయంగా ఉందా?" అడిగాడు నవ్వి.

"కాదు. కడుపులో తిప్పుతున్నట్లుగా ఉంది."

"దాన్ని సీసిక్నెస్ అంటారు. కొత్తల్లో అలాగే ఉంటుంది.

ఇంజన్ ఆపుచేశాడు నాయర్.

కొంచెందూరం వెళ్ళి ఆగిపోయింది బోటు. నాయర్ లేచి నిల బడ్డాడు. వినోద్ కూడా లేచాడు.

"అదుగో దాన్నే తిమింగలం అంటారు"

దూరంగా చేతితో చూపించాడు నాయర్ నీళ్ళలోకి.

"ఎక్కడ? మనల్ని ఏం చెయ్యదుగా?" పరిశీలనగా నీళ్ళలోకి నాయర్ చేతిలో చూపించిన వైపు చూస్తూ అడిగాడు వినోద్.

నీళ్ళలో ఏమీ కనిపించలేదు. అసలు నీళ్ళలో కదిలికేలేదు.

"ఎక్కడ?"

వెనక్కి తిరుగుతున్న వినోద్ వీపులో బలంగా గుచ్చాడు నాయర్ తను తాజమహల్ హోటల్నుంచి తెచ్చిన కత్తితో.

"అబ్బా అరిచాడు వినోద్ బాధగా.

నాయర్ నీళ్ళలోకి చూశాడు భీతిగా, బాధగా.

"ఎందుకు? ఎందుకు? అడిగాడు బాధగా మెలి తిరుగుతూ.

గుచ్చిన కత్తి బయటకి లాగి మళ్ళీ గుచ్చాడు నాయర్. ఈసారి ఇంకా బలంగా కడుపులో.

ఎగిరి నీళ్ళలో పడ్డాడు వినోద్. నీళ్ళలో పడేటప్పుడు కళ్ళు మూసుకుపోవడం గమనించాడు నాయర్.

కొన్ని నిముషాలు ఆయాసం తీర్చుకుంటూ నీళ్ళలోకి చూస్తూండి పోయాడు. క్షణాలలో వినోద్ పడ్డచోట నీళ్ళంతా ఎర్రగా మారిపోయింది రక్తంతో.

వినోద్ మళ్ళీ తేలతాడేమోనని అయిదు నిముషాలు పైనేచూశాడు నాయర్ తేలలేదు.

గుండె కొట్టుకునే వేగం తగ్గి మామూలు స్థితికి వచ్చింది. నుదుట పట్టిన చెమట ఆరిపోయింది సముద్రం గాలికి.

జేబురుమాలుతో బోటులో కారిన రక్తం చుక్కలు శుభ్రంగా తుడిచి, కడిగి, చేతులు తుడుచుకున్నాడు నాయర్.

వెంటనే బోటు స్టార్టుచేసి వెనక్కి తిప్పాడు బొంబాయి వేపు.

వినోద్ తప్పకుండా మరణించి ఉంటాడు ఈపాటికి. అంతరక్తం కారిపోయినతను నీళ్ళలో ఈదలేడు. ఈదగలిగినా పాతికమైళ్ళు ఈదుకుంటూ రాలేడు బొంబాయిదాకా.

శవం కూడా ఒడ్డుకు చేరదు. సముద్రంలోని జలచరాలు తినేస్తాయి. తన నేరం ఎవ్వరూ రుజువు చేయలేరు కాబట్టి తను చెప్పిందే సమ్మారి.

పదిమైళ్ళు వచ్చాక సముద్రంలో బొంబాయికి పదిహేనుమైళ్ళు ఇవతల పారేశాడు కర్చీప్ నీళ్ళలోకి.

బోట్ ఒడ్డున ఆపి. టాజమహల్ వైపు పరిగెత్తాడు.

"ఏమయింది?" అడిగింది రిసెప్షనిస్టు నాయర్ ఖంగారు గమనించి.

"చెపుతాను"

నాయర్ టెలిఫోన్ అందుకుని, జేబులోంచి కార్డుతీసి చకచకా నంబర్ తిప్పాడు.

"హలో వెంటనే మీరు రావాలి నేను నాయర్‌ని టాజనుంచి."
"ఏం జరిగింది?" అడిగింది రిసెప్షనిస్టు మళ్ళీ.
"చెపుతాను"
మరో నెంబర్ తిప్పాడు నాయర్.

"హలో నాయర్ స్పీకింగ్. ఛస్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌ని పిలవండి దయచేసి."

అని ఆగి. రిసీవర్ మూసి, రిసెప్షనిస్టువైపు తిరిగి అన్నాడు.
"ప్రమాదం జరిగిపోయింది."
"ఏమిటి? వినోద్ కేనా?" అడిగింది ఖంగారుగా.
"అవును."
"ఏమయ్యాడు?"
"అతను...."
రిసీవర్ తెరచి గట్టిగా.

"హలో మీరు వెంటనే టాజ్‌కి రావాలి వినోద్‌కి ప్రమాదంసంభవించింది. మరణించాడు"

"గాడ్! ఎలా?" అరిచింది రిసెప్షనిస్టు.

"హలో బోట్‌లో సముద్రంలోకి వెళ్ళాము ఇద్దరం వద్దంటున్నా వినకుండా ఈతకొట్టడానికి దిగాడు నీళ్ళలోకి. మళ్ళీ కనబడలేదు. అరగంట పైనేచూసి వచ్చేసాను"

రిసీవర్ పెటేశాడు వెంటనే.

"ఎవరయినా వస్తే నా గదిలోకి పంపించండి" పైకి పరిగెత్తాడు నాయర్.

తన గదిలోకి వెళ్ళి, తలుపు దగ్గరగావేసి, ఓ చిన్నసీసాతీసి,రెండు స్లీపింగ్ టేబ్‌లెట్స్ వేసుకుని నీళ్ళు తాగాడు.

అరగంట తర్వాత నాయర్ గదిలోనికి వచ్చిన వాళ్ళంతా నాయర్ వున్న పరిస్థితి గమనించి డాక్టర్‌ని పిలిపించారు వెంటనే.

పావుగంట తర్వాత లేచాడు నాయర్, డాక్టరు ఇచ్చిన ఇంజక్షన్ ప్రభావంవల్ల.

"నన్నెందుకు లేపారు?" అడిగాడు.

"ఏం జరిగింది? చెప్పండి" అడిగారు అంతా.

"నీళ్ళలోకి దిగాడు వద్దన్నా వినకుండా. అంతే మళ్ళీ కనపడ లేదు"

"ఎక్కడ?"

"పదిమైళ్ళ లోపలే"

"ఏవైపు?"

"సూటిగా వెళ్ళాము గేట్‌వే ఆఫ్ ఇండియా నుంచి"

"స్లీపింగ్‌పిల్స్ వేసుకున్నారే?"

"నిద్ర పట్టడానికి. బాధ భరించలేక అనవసరంగా నేనే పిలిచాను వినోద్‌ని. అసలు గుమ్మందాకా వెళ్ళేదాకా పిలుద్దామనే ఆలోచనే కలగ లేదు. చివరి క్షణంలో కలిగింది.

"బేడ్‌లక్"

"నిజంగా బేడ్‌లక్. ఓ మంచి చెస్ ఆటగాణ్ని సముద్రం పొట్టన పెట్టుకుంది."

"ధైర్యంగా ఉండడి. వినోద్ మృతదేహం కోసం వెతికించే ఏర్పాట్లు చేస్తాను."

"ఐ వాంట్ రెస్టు అన్నాడు నాయరు. పత్రికా విలేఖరుల ప్రశ్న లకి సమాధానంగా.

అందరూ బయటికి వెళ్ళగానే తలుపు లోపల గడియ వేసుకుని పడుకున్నాడు నాయరు తృప్తిగా.

* * *

మర్నాడు ఉదయం ఇండియన్ చెస్ అసోషియేషన్ బిల్డింగ్‌లో సమావేశం అయ్యారు అంతా. వినోద్ మరణానికి సంబంధించిన విశే షాలు ముద్రింపబడ్డ పేపర్లు అందరి చేతుల్లో ఉన్నాయి.

మైక్ ముందు నిలబడి చెప్పసాగాడు ప్రెసిడెంట్ బాధ ధ్వనించే కంఠంతో.

"ఈపాటికి ఆ చెడ్డవార మీకందరికి తెలిసిపోయి ఉంటుంది. ప్రఖ్యాత చెస్ చాంపియన్ వినోద్ ఇకలేడు మనమధ్య ప్రమాదవశాత్తు మృత్యువు అతడ్ని కబళించింది, మనం వినోద్ మరణానికి విచారించడం తప్ప మరేమీ చేయలేము."

అని కొన్ని క్షణాలాగి మళ్ళీ చెప్పసాగాడు.

"మన అసోషియేషన్ రూల్సు ప్రకారం పోటీలో పాల్గొనే ఇద్ద రిలో ఒకరు ఏ కారణం చేతయినా—అంటే పిచ్చివల్లగాని, మరణంవల్ల గాని, విదేశపయనంవల్లగాని మరే కారణంచేతయినాగాని పోటీలోపాల్గొనక పోతే, రెండో వ్యక్తి ఆ సంవత్సరం ఇండియన్ చెస్ మాస్టర్‌గా నిర్ణ యించబడతారు.

"ఆర్టికల్ ఎనిమిది ప్రకారం, వినోద్ మరణం కారణంగా, నాయ ర్‌ని ఈ సంవత్సరం భారత చదరంగం...."

చెబుతున్న ప్రెసిడెంట్ చేతికి చిన్న కాగితం ఇచ్చాడు ఒకతను.

ప్రెసిడెంట్ ఆ కాగితంలోని వాక్యాలు చదివాడు. కనుబొమలు ముడుచుకున్నాయి. ఒకసారి ప్రక్కన కూర్చున్న నాయర్ వంక చూసి,

కాగితం మడిచి జేబులో వేసుకుని, నాయరుకి వినబడేటట్లు, మైక్ మూసి అన్నాడు పంగి.

"మీకోసం ప్రక్కగదిలో ఎవరో వెయిట్ చేస్తున్నారువెళ్ళండి"

"మన కార్యక్రమం పూర్తిచేద్దాం ముందు కొద్దిసేపు, ఆగుతారు వాళ్ళు" అన్నాడు నాయర్.

"ప్లీజ్ ముందర వాళ్ళ సంగతి చూడండి. చాలా ముఖ్యం"

"నాయర్ అయిష్టంగానే కుర్చీలోంచి లేచి ప్రక్క గదిలోకి వెళ్ళాడు.

"మీరేనా నన్ను చూడాలన్నది?" అడిగాడు నాయర్ ఎదురుగా వున్నతనని చూస్తూ.

"అవును" అన్నాడు అతను నవ్వుతూ.

"మీరెవరో నాకు తెలీదు."

"తెలుస్తుంది యు ఆర్ అండర్ అరెస్టు"

"ఏమిటి?"

అదిరిపడి చూశాడు నాయర్.

"యస్. యు ఆర్ అండర్ అరెస్టు"

చెప్పాడు అతను నెమ్మదిగా.

"దేనికి?"

"వినోద్‌ని హత్య చేసిన నేరానికి"

"పొరపాటు"

"కాదు."

"ఓ. ఎవరు?"

"మఫ్టీలోవున్న డిటెక్టివ్ ఇనస్పెక్టర్. ఐడెండిఫికేషన్ కావాలా?" జేబులోంచి కార్డుతీసి చూపించాడు నాయర్‌కి.

"అరెస్టువారంట్ తెచ్చాను. సరయిన సమయానికే వచ్చాను. లేక పోతే మీరు చెస్ మాష్టర్ అయేవాళ్ళే నవ్వాడు.

"ఎల జరిగింది? నేను హత్య చేసినట్లు ఆధారమేమిటి?" అడిగాడు కోపంగా నాయర్,

"వినోద్ ఏమయ్యాడో చెప్పగలరా?"

"చచ్చిపోయాడు నీళ్ళలో మునిగి"

తలుపు చప్పుడయింది ఇద్దరూ తలుపువంక చూశారు. ఇండియన్ ఛస్ అసోషియేషన్ ప్రెసిడెంట్ నిల్చుని ఉన్నాడు తలుపు దగ్గర.

"ఏమయింది?" అడిగాడు.

"నాయర్ ఇక స్టేజ్ మీదకిరాడు. హత్యానేరంమీద అరెస్టు చేస్తు న్నాము. మీ ప్రోగ్రాం కేన్సిల్ చేసుకోవచ్చు" చెప్పాడు డిటెక్టివ్ ఇన స్పెక్టర్.

"యు కాంట్ డు ఇట్. నేను హత్యా చేశానని ఎలా నిరూపించ గలరు?"

గొంతు చించుకున్నాడు నాయర్ కోపంగా.

"వినోద్ని మీరు పొడిచి చంపారు?"

"పొరపాటు"

"నిజం పచ్చి నిజం. మీరు టాజ్మహల్ రూంలోని కత్తితో పొడిచారు"

"వినోద్ శవం దొరికిందా!" అడిగాడు నాయర్, ఆతృతగా.

చిన్నగా నవ్వాడు ఇనస్పెక్టర్.

"దొరికేది కాదు, అసలు తెలివిగలవాడు వినోద్.

"జీనియస్ తన శవం దొరికేలా చేసుకున్నాడు."

"ఎలా!"

కత్తివాటుకి నెత్తురుచుక్క లేదు నాయర్ మొఖంలో. భయం స్పష్టంగా కనపడుతోంది.

"మీరు పొడవగానే నీళ్ళలోకి దూకాడు. తను చచ్చిపోతానని

తెలుసు. మిమ్మల్ని పట్టివ్వాలి అదే అతని ఆఖరి కోరిక. చదరంగం ఆడటంవల్ల క్విక్ థింకింగ్ కెపాసిటి అలవడినట్లుంది."

"ఏం చేసాడు?"

"మీ బోటుకిందకు వెళ్ళాడు ఈదుకుంటూ. తను ఇన్‌షర్టుకు వేసుకున్న బెల్టుని మీ బోటుకింద వున్న ఓ హుక్‌లాంటి దానికి తగిలించాడు. తర్వాత రెండు చేతులతో ఓ కడ్డీని పట్టుకున్నాడు. వెంటనే చచ్చిపోయి వుంటాడు అలాగే బిగిసిపోయాడు బెల్టువల్లా, చేతిపట్టువల్ల బోటు కింది భాగంలోనే బోటుకు అతుకున్నట్లుగా వుండిపోయాడు"

"పొరపాటు"

"ఏమిటి పొరపాటు! మీకు తెలియకుండా మీతోపాటే ఒడ్డుకి రావడమా? అతని వీపుకి అయిన గాయమా? కడుపులో గుచ్చుకునివున్న కత్తా?"

నాయర్ రెప్పవాల్చకుండా చూస్తుండిపోయాడు ఇనస్పెక్టర్ వంక.

"చదరంగంలో పావులని చంపినట్లు నిజజీవితంలో మనుషులను చంపలేం. హంతకులకే కాదు, హతులకికూడా తెలివితేటలుంటాయి తెలుసా?"

జీవంలేని నవ్వు నవ్వాడు నాయర్, చేతులు అందిస్తూ.

(అపరాధ పరిశోధన జూలై 1972)